క్లుప్తంగా

భక్తి పరవశం.. శ్రీవారికి పూజలు


అలంకరణలో స్వామివారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.

తర్లుపాడు ఎస్సైను సస్పెండ్ చేయాలి


బాధితుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న రంగసాయిరెడ్డి

తర్లుపాడు: విధులపట్ల నిర్లక్ష్యం, వేధింపులు, అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన తర్లుపాడు ఎస్సైను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజా సంకల్పవేదిక జాతీయ అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సివిల్ కేసుల్లో అనవసర జోక్యంపై ఆయన ఆందోళన వెలిబుచ్చారు. మండల ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుంటే చూస్తూ ఊరుకోమని తెలిపారు. గతంలో అనేక కేసుల్లో ఎస్సై అన్యాయంగా ప్రవర్తించారని వివరించారు. ఈ సందర్భంగా గత నాలుగైదు నెలలుగా తన కారు పోయిందంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని తర్లుపాడుకు చెందిన మొహిద్దీన్‌బాషా దంపతులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ప్రజాసంకల్ప వేదిక మండల అధ్యక్షులు ఫిరోజ్, జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కార్యదర్శి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన లా పరీక్షలు


పరీక్షలు రాస్తున్న లా విద్యార్థులు

మార్కాపురం: పట్టణంలోని ఐడీఎల్ డిగ్రీ కళాశాలో లా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపల్ వై రమేష్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ పరీక్షలు జరిగాయని తెలిపారు. యూనివర్సిటీ అబ్జర్వర్ మాధవీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. 3 సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులో 59 మంది, 5 సంవత్సరాల కోర్సులో 118 మంది హాజరైనట్లు తెలిపారు.

- తక్కువ పెట్టుబడి.. అధిక ఆదాయం
- బేస్తవారిపేట, కంభం, కోమరోలు, రాచర్ల మండలాల్లో సాగు
- గుమ్మడి సాగు వైపు చూస్తున్న రైతన్నలు

గుమ్మడి సాగు.. గుబాళింపు!


పొలంలో నిండుగా నాణ్యమైన గుమ్మడికాయలు

బేస్తవారిపేట: వాణిజ్య పంటలతో నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది మిరప, పత్తి పంటలు సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లేకపోవడంతో గుమ్మడి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. బేస్తవారిపేట మండలంలోని జేసీ అగ్రహారం, గంటాపురం, కంభం మండలంలోని తురిమెళ్ల, కొమరోలు మండలం పాములపల్లె, రాచర్ల మండలంలో దాదాపుగా 300 ఎకరాల్లో రైతులు గుమ్మడి పంటను సాగు చేపట్టారు.

ఎకరాకు 8–12 టన్నుల దిగుబడి..

ఎకరా గుమ్మడి పంట సాగుకు విత్తనాలు రూ.1000 (లూజు), సేద్యం, దుక్కిలకు రూ.4 వేలు, ఎరువులు రూ. 3 వేలు, పురుగు మందులు 4 వేలు, కూలీల ఖర్చు రూ.4 వేలు ఖర్చు అవుతుంది. విత్తనం నాటిన 30 రోజులకు ఆడపువ్వులు ఎక్కువగా, మగ పూలు తక్కువగా వచ్చేందుకు బోరాన్ మందును పిచికారీ చేస్తున్నారు. 35 రోజులకు పాదుకు పూత, 40–45 రోజుల మధ్య తీగ వచ్చి, పూత పిందె వస్తాయి. 80–90 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ప్రస్తుతం కేజీ ధర రూ.6–8 రూపాయాలు పలుకుతుంది. ఒక ఎకరాకు 8–12 టన్నుల దిగుబడి వస్తుంది. తమిళనాడు, తెలంగాణ మార్కెట్‌కు గుమ్మడికాయలను తరలిస్తున్నారు. ధర తక్కువగా ఉందనుకుంటే రెండు రోజులు నిల్వ ఉంచినా గుమ్మడికాయలు చెడిపోవు. ఒక్కో ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి ఖర్చు అవుతుందని, పంట దిగుబడి బాగ వస్తే రూ.70 వేల–రూ.1లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు.

ఖర్చు తక్కువ..



బేస్తవారిపేట మండలంలో మొట్టమొదటగా గత ఏడాదిలో ఒక ఎకరాలో గుమ్మడి పంటను సాగు చేశాను. మిరప పంట సాగుతో నష్టపోయాను. ఈ ఏడాదిలో మూడు ఏకరాల్లో గుమ్మడిసాగు చేశాను. పెట్టుబడి ఖర్చు తక్కువ ఆదాయం బాగానే ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.6–8 ధర పలుకుతుంది.

– దప్పిలి కాశిరెడ్డి, జేసీ అగ్రహారం

ఆదాయం బాగానే ఉంది..



నేను నాలుగు ఎకరాల్లో గుమ్మడి పంట సాగు చేయడం జరిగింది. దిగుబడి బాగా వచ్చింది. వ్యాపారస్తులు పొలంలోని గుమ్మడికాయలను చూసి నాలుగు ఎకరాల్లోని పంటను రూ.3.50 లక్షలకు కొనుగోలు చేశారు. 80–90 రోజుల పంటకు రూ.2.50 లక్షల ఆదాయం వచ్చింది.

– మూర్క బుగ్గారెడ్డి, జేసీ అగ్రహారం

3 ఎకరాల్లో సాగు చేశాను..



గుమ్మడి పంట సాగులో శ్రమ తక్కువగా ఉంది. పెట్టుబడి ఖర్చు తక్కువే. నేను 3 ఎకరాల్లో సాగు చేశాను. పంట కోతకు వచ్చింది. చిన్నపాటి మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు. మిగిలిన పంటలకంటె గుమ్మడిసాగు బాగుతుంది.

– దొడ్డి పెద్దిరెడ్డి, జేసీ అగ్రహారం


సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన కృష్ణచైతన్య


ఆదిమూలపు సురేష్‌తో మాట్లాడుతున్న అన్నా

సజ్జల, సురేష్‌ను కలిసిన అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు శనివారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి, కొండపి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను కలిశారు. సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజక వర్గంలో పార్టీ పరిస్థితులు, ఛలో మెడికల్ కాలేజీ నిర్వహణపై వివరాలు అందించారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్ఠతకు కృషిచేయాలని సజ్జల సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న డాక్టర్ సురేష్‌ను అన్నా రాంబాబు పరామర్శించారు. అన్నా వెంట ఆయన తనయుడు అన్నా కృష్ణచైతన్య ఉన్నారు.

శాంతిమార్గంలో పయనించాలి


జైలులో ఖైదీలకు పెట్టే బియ్యాన్ని పరిశీలిస్తున్న జడ్జి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ జైలును జిల్లా జడ్జి ఏ.భారతి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలకు పెట్టే ఆహార నాణ్యతపై ఖైదీలను అడిగితెలుసుకున్నారు. ఖైదీలకు ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులపై జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, జైలు శిక్ష అనంతరం మీలో తప్పకుండా మార్పువచ్చేలా ఉండాలన్నారు. నేరప్రవృత్తిని విడనాడి శాంతిమార్గంలో పయనించేందుకు ప్రయతి్నంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికార సేవా సంస్థ సెక్రటరీ ఎస్.కె.ఇబ్రహీం షరీఫ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి ఏ.ఓంకార్, అడిషినల్ జడ్జి భరత్ చంద్ర, జైలు సూపరిండెంటెంట్ లింగారెడ్డి, న్యాయవాదులు అహల్య, పారాలీగల్ వలంటర్ మధు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి


విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నరసింహారావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవాల్సిన వయస్సులో ఇతర వ్యసనాలను అలవాటు చేసుకొని భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయని, ఎవరైనా కొత్త వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకుఖాతాల వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పకూడదన్నారు. ఎ ఈఅనంతరం వాసవీ జూనియర్ కాలేజి, గౌతమ్ కాలేజీలల్లో అవగాహన కల్పించారు.

విద్యార్థులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 17, 18వ తేదీల్లో పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో శనివారం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఎంఈవో ఎంఈవో పి.నాగభూషణ్‌రెడ్డి, పీడీ గుర్రం శోభన్‌బాబు, పీఈటీ ధనలక్ష్మీ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన డాక్యుమెంట్ రైటర్ల సమ్మె


నిరసన వ్యక్తంచేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

మార్కాపురం టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డాక్యుమెంట్ రైటర్స్ చేస్తున్న సమ్మె 2వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు టి సుబ్బారావు, పి శివ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశపెట్టిన ఆధార్ ఓటీపీ వలన దస్తావేజుల తయారీ కష్టమైందన్నారు. గ్రామ ప్రాంతాల వారు ఆస్తులు కొనాలన్నా, అమ్మాలన్నా ఆధార్ ఓటీపీతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాఫ్ట్‌వేర్ లోపాల వలన డాక్యుమెంటేషన్ తయారు చేయడం చాలా ఆలస్యమవుతోందన్నారు. ఓటీపీ విధానాన్ని పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్, సబ్‌రిజిస్ట్రార్‌లకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జి లక్ష్మీరెడ్డి, పీవీ సుబ్బయ్య, బెంజిమెన్, స్టార్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

మార్కాపురం టౌన్: పురపాలకసంఘం పరిధిలో సచివాలయాలకు వచ్చే ప్రజా సమస్యలను సత్వరమే సిబ్బంది పరిష్కరించాలని కమీషనరు నారాయణరావు సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తమ సచివాలయం పరిధిలో మంచినీటి సరఫరా, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి సంబంధిత డీఈ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను క్షేత్రస్థాయిలో తనిఖీచేసి పరిష్కరించేందుకు తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణంలో అనధికార కట్టడాలను గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని భవన యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణంలోని 21 సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

పొదిలి: మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏపిఆర్ గ్రూపు సంస్థల అధినేత ఆవుల కృష్ణారెడ్డి బాధిత కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. ఈమేరకు గతంలో ఇచ్చిన హామీ మేరకు నిత్యావసర సరుకులను అందించారు. ఆ సరుకులను శుక్రవారం సంస్థ సభ్యులు చేతుల మీదుగా ఆయా కుటుంబాల వారికి అందించారు. ఒకొక్క కుటుంబానికి రూ.5 వేల విలువైన సరుకులను మూడు కుటుంబాల వారికి అందించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నగలు అపహరించిన దొంగ అరెస్టు

గిద్దలూరు రూరల్: కత్తిచూపించి బంగారు నగలు అపహరించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ కే సురేష్ తెలిపారు. శనివారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. తిరుపతి వద్ద గల తిరుచానూర్‌కు చెందిన ఇరగం రెడ్డి శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి చెడువ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతుండేవాడు. అందులో భాగంగా గతేడాది 19 అక్టోబర్ 2024 గిద్దలూరు పట్టణంలోని షరాఫ్ బజారులో గల పావని జ్యువెలరిషాపులో తాను ప్రభుత్వ ఉద్యోగిని పరిచయం చేసుకున్నాడు. మాయమాటలు చెప్పి కొన్ని బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తానని షాపు యజమానికి చెప్పి తన వెంట గుమస్తాను పంపితే డబ్బులు ఇస్తానని నమ్మించి తనతో పాటుగా బైక్‌పై తీసుకెళ్తాడు. అనంతరం గుమస్తాను బైక్‌పై నుంచి దించి కత్తి చూపి అతడిని చంపుతానని బెదిరించి బంగారు ఆభరణాలను తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. అందులో భాగంగా శ్రీనివాసరెడ్డిని పట్టణంలోని పీఆర్.కాలని వద్ద అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 66 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. శ్రీనివాసరెడ్డి ఈ కేసులోనే కాకుండా కడపజిల్లా, నెల్లూరు జిల్లాల్లోను ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడుతుండేవాడని సీఐ తెలిపారు.

పశువుల తొట్టెల్లో నీటిని నింపారు..

సాక్షి ఎఫెక్ట్..

రాచర్ల: పశువుల తొట్టెల్లో అధికారులు నీటిని నింపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల నీరు తాగేందుకు నిర్మించిన నీటి తొట్టెలు నీరు లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయని ఈ నెల 17వ తేదీన ఖాళీ తొట్టెలతో.. పశువుల దాహార్తి తీరేదెలా.. అనే శీర్షిక సాక్షిలో వచ్చిన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు రంగారెడ్డిపల్లె, సత్యవోలు, అనుములపల్లె గ్రామాల్లో ఏపీవో మహాలక్ష్మి పర్యటించి నీటి తొట్టెలను పరిశీలించి వాటిని శుభ్రం చేసి నీటిని నింపారు.

నల్లమలలో గుండ్లకమ్మ పరవళ్లు


తాళ్ల సహకారంతో భక్తులకు సురక్షితంగా బయటికి తరలిస్తున్న పోలీసులు


నీటిగుండంలో దూకుతున్న గుండ్లకమ్మ

రాచర్ల: గుండ్లకమ్మ వాగు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం వెళ్లిన భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా గుండ్లకమ్మ పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో శనివారం నెమలిగుండ్ల రంగనాయక స్వామి దర్శనం పూర్తిగా నిలిపేశారు. ముందుగా స్వామి దర్శనం కోసం వెళ్లిన భక్తులను తాళ్లతో పాటు ట్రాక్టర్ల సహకారంతో క్షేమంగా బయటికి తీసుకొచ్చారు. స్వామి దర్శనం కోసం గుండ్లకమ్మ వాగులోకి వెళ్లకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్యతో పాటు ఎస్సై పి.కోటేశ్వరరావు, ఫారెస్టు ఎఫ్‌వో రామయ్య పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకున్నారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి


సబ్‌జైలులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి భారతి

మార్కాపురం: సబ్‌జైలును శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి రిమాండు ఖైదీలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఈమె వెంట జిల్లా జైళ్ల పర్యవేక్షణ అధికారి షరీఫ్, మార్కాపురం జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి శుభవాణి, సబ్‌కోర్టు జడ్జి దేవేందర్‌రెడ్డి, సివిల్‌కోర్టు జడ్జి కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఓ లాడ్జీలో శనివారం పేకాట ఆడుతున్న 5 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా శనివారం పలు లాడ్జీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఈ దాడుల్లో పట్టణ ఎస్సై సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు. అయితే కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఉన్న లాడ్జిలవైపు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని పలువురు లాడ్జీల యజమానులు ఆరోపిస్తున్నారు. కాలేజీ రోడ్డు, ఒంగోలు రోడ్డులో ఉన్న కొన్ని లాడ్జిల్లో పోలీసులు లాడ్జిలవైపు కూడా చూడకపోవడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఉర్దూ విద్యార్థులకు ప్రశంస పత్రాలు


ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ

కంభం: వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభకనబరిచిన కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం విద్యార్థులకు శనివారం మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్ ప్రశంస పత్రాలు అందజేశారు. ఉర్దూ భాష ప్రాముఖ్యతను రమ్యంగా రచించి, వివరించిన విజేతలుగా నిలిచిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో మస్తాన్ వలి, పాండు రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.